సాక్షి

కాకినాడ

గురువారం । 9 । ఫిబ్రవరి । 2023



ఆమె కీర్తి.. ఎందరికో స్ఫూర్తి

అంతర్జాతీయ కరాటేలో సత్తా చాటుతూ.. యువతకు ఆదర్శంగా నిలుస్తోంది కొవ్వూరుకు చెందిన కరాటే రాధ.

8 లో



నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

ఇంద్రకీలాద్రి: విజయవాడ దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదాన పథకానికి ఎస్.రామచంద్రారెడ్డి (కాకినాడ జిల్లా జి.మామిడాడ) బుధవారం రూ.1,01,116 విరాళం సమర్పించారు.

డెల్టాలకు 6,895 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు బుధవారం 6,895 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు 2,030, సెంట్రల్ 1,325, పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.50 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

రత్నగిరి కిటకిట



సత్యదేవుని ఆలయం వద్ద భక్తుల రద్దీ

అన్నవరం: రత్నగిరి బుధవారం భక్తులతో కిటకిటలాడింది. సుమారు 25 వేల మంది భక్తులు సత్యదేవుని దర్శించి, పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలివచ్చారు. సత్యదేవుడిని దర్శించిన అనంతరం సప్తగోకులంలో ఆవులకు ప్రదక్షిణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, ప్రదక్షిణ చేశారు. వ్రతాలు 1,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.25 లక్షల ఆదాయం సమకూరింది. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో సుమారు 5 వేల మంది భక్తులకు భోజనం పెట్టారు. గురువారం నుంచి ఆదివారం వరకూ పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగే అవకాశం ఉంది. దీంతో ఈ నాలుగు రోజులూ ఆలయంలో రద్దీ ఉండవచ్చని భావిస్తున్న అధికారులు ఆ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ట్రస్ట్‌బోర్డు సభ్యుల ప్రమాణ స్వీకారానికి ఏర్పాట్లు

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి సభ్యుల ప్రమాణ స్వీకారానికి దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవదాయ శాఖ కమిషనర్ సి.హరిజవహర్‌లాల్ ఆదేశాల మేరకు 30 రోజుల్లోగా ధర్మకర్తల మండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సభ్యులు వస్తే వారితో సత్యదేవుని ఆలయం వద్ద గురువారం ప్రమాణ స్వీకారం చేయించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో మాదిరిగా గ్రూప్‌గా కాకుండా వ్యక్తిగతంగా ఎవరు వస్తే వారితో ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. గురువారం ఉదయం కొంతమంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేసే అవకాశం ఉందని చెబుతున్నారు.

సత్రాలు, ఆలయ భూముల వివరాలు ఇవ్వాలి

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): సత్రాలు, ఆలయ భూముల సమగ్ర వివరాలు ఇవ్వాలని ఈఓలను దేవదాయ శాఖ తనిఖీదారు వడ్డి ఫణికుమార్ ఆదేశించారు. కాకినాడలోని దేవదాయ శాఖ కార్యాలయంలో ఈఓలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. జగనన్న భూ సర్వేలో దేవదాయ శాఖ భూములకు సంబంధించి ఏమైనా అభ్యంతరాలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఆయా సత్రాలు, ఆలయాలకు ఎంత భూమి ఉంది, ఏమైనా ఆక్రమణలో ఉందా తదితర విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఆక్రమణలో ఉన్న భూమిపై కోర్టులో కేసులుంటే అవి ఏ పరిస్థితిల్లో ఉన్నాయో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.

డీవార్మింగ్ డే వాయిదా

కాకినాడ క్రైం: ఈ నెల 10వ తేదీన నిర్వహించాల్సిన డీ వార్మింగ్ డే (నులిపురుగుల నివారణ దినోత్సవం), ఫైలేరియా మందుల పంపిణీ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు బుధవారం వెల్లడించారు. ఈ కార్యక్రమాన్ని ఒకే దశలో పూర్తి చేయాలన్న రాష్ట్ర శాఖ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. తొలి దశలో పాఠశాల విద్యార్థులకు 2 లక్షల ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వాలని భావించినా, నిర్ణీత వర్గాల వారందరికీ ఒకేసారి ఇస్తే సానుకూల ఫలితాలు రాబట్టవచ్చన్న నిపుణుల సూచనలతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

వేలంలో రూ.19 లక్షల అదనపు ఆదాయం

పెద్దాపురం: కాండ్రకోట నూకాలమ్మ అమ్మవారి దేవస్థానానికి టెండర్ కం బహిరంగ వేలంలో గత ఏడాది కంటే రూ.19.01 లక్షల అదనపు ఆదాయం సమకూరింది. పెద్దాపురం తనిఖీదారు చల్లా ఉదయబాబు నాయుడు, సామర్లకోట శ్రీ కుమారారామ భీమేశ్వర స్వామి వారి దేవస్థానం ఈఓ డి.నాగమల్లేశ్వరరావు పర్యవేక్షణలో నూకాలమ్మ వారి దేవస్థానం ప్రాంగణంలో బుధవారం వేలం పాటలు నిర్వహించారు. కొబ్బరి చెక్కలు పోగు చేసుకునే హక్కుకు రూ.4.51 లక్షలు; చీరలు, రవికెలు, గాజులు తదితర సామగ్రికి రూ.10.71 లక్షలు; తలనీలాలకు రూ.7.66 లక్షలు; మేకలు, కోళ్లు, ఎనుపోతులు పోగు చేసుకునే హక్కుకు, గండ దీపాలు, గరగల విక్రయం హక్కుకు రూ.1.51 లక్షలు; తాళ్లు, రక్షరేకులు అమ్ముకోవడానికి రూ.3.61 లక్షలు; కోళ్లు, మేకలు, ఎనుపోతుల సమర్పణ హక్కుకు రూ.18.95 లక్షల చొప్పున పాటదారులు పాడుకున్నారు. ఈ వేలం పాటల ద్వారా గత ఏడాది రూ.27.94 లక్షలు రాగా ఈ ఏడాది రూ.46.95 లక్షలు సమకూరిందని ఆలయ ఈఓ టీవీ సూర్యనారాయణ తెలిపారు. వేలం ప్రక్రియలో పెద్దాపురం జెడ్పీటీసీ జి.సూరిబాబు, దేవస్థానం చైర్మన్ వీరాస్వామి, ధర్మకర్తలు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

ఇంకానా.. ఇకపై చెల్లవ్..



- చిట్స్ మోసాలపై ప్రభుత్వం కన్నెర్ర
- నిబంధనల కొరడా ఝళిపించాలని ఆదేశాలు
- చట్టానికి లోబడితేనే అనుమతులివ్వాలని స్పష్టీకరణ



కాకినాడ లీగల్: పిఠాపురానికి చెందిన ఓ చిట్‌ఫండ్ కంపెనీ నిబంధనలు పాటించకుండా.. చిట్టీ పాడిన తరువాత పాటదారులకు సొమ్ము చెల్లించలేదు. దీనిపై పాటదారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ కంపెనీ వ్యవహారాలను, రికార్డులను అధికారులు పరిశీలించగా పాటదారులకు చిట్టీ సొమ్ము నగదు రూపంలో చెల్లించినట్లు ఉంది. వాస్తవానికి పాటదారులకు సొమ్మును చెక్కు రూపంలోనే చెల్లించాలి. నిబంధనలకు విరుద్ధంగా జరిగిన ఈ వ్యవహారాలపై నివేదికను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రాష్ట్ర ఐజీకి స్థానిక అధికారులు పంపించారు.

▸▸ చిట్టీ సొమ్ము సమయానికి ఇవ్వడం లేదని మరో కంపెనీపై అధికారులకు పాటదారులు ఫిర్యాదు చేశారు.

– ఇలా నిబంధనలకు విరుద్ధంగా ఇష్టానుసారం చిట్స్ వేయడం.. పాటలు నిర్వహించి, సమయానికి సొమ్ములు ఇవ్వకపోవడం.. చిట్స్‌కు సంబంధించిన ఖాతాల్లో సొమ్ము ఉండకపోవడం.. కొన్ని చిట్స్ కంపెనీలు అనేక మోసాలకు పాల్పడుతూండటంతో పాటదారులు నష్టపోతున్నారు. ఇలా ప్రజలను నిలువునా ముంచేస్తున్న చిట్స్ సంస్థలను గత ప్రభుత్వం పట్టించుకోనేలేదు. ఫలితంగా పెద్ద సంఖ్యలో పాటదారులు నష్టపోతున్నారు. దీనిని గుర్తించిన ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం చిట్స్ కంపెనీలపై నిబంధనల కొరడా ఝళిపిస్తోంది. వాటి మోసాలకు చెక్ పెట్టడం ద్వారా ప్రజల ప్రయోజనాలు కాపాడేందుకు చర్యలు తీసుకుంటోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ చిట్‌ఫండ్ కంపెనీల వ్యవహారాలపై సంబంధిత అధికారులు దృష్టి సారిస్తున్నారు.

నిబంధనలు పాటించాల్సిందే..

- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో రిజిస్టర్ అయిన చిట్‌ఫండ్ కంపెనీలు 73 ఉన్నాయి. ఇవన్నీ కాకినాడలోని చిట్స్ డిప్యూటీ రిజిస్ట్రార్ నుంచే అనుమతులు పొందాల్సి ఉంది. కొత్తగా చిట్ ప్రారంభించాలన్నా, ఇప్పటికే చిట్ అనుమతి పొందినా.. ఆయా సంస్థలు తప్పనిసరిగా చిట్‌ఫండ్ చట్టం–1982లోని నిబంధనలు పాటించాలి. వాటికి లోబడి ఉంటేనే ఆ చిట్‌లకు అనుమతులివ్వాలని, కొనసాగించాలని సంబంధిత అధికార యంత్రాంగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది.
- నిబంధనలు పాటించకపోయినా, పాట అయిన తరువాత పాటదారుకు సమయానికి సొమ్ము చెల్లించకపోయినా చర్యలు తీసుకుంటారు.
- చిట్స్ ఖాతాలు నిర్వహిస్తున్నారో లేదో అధికారులు తప్పనిసరిగా పర్యవేక్షించాలి.
- చిట్‌ఫండ్ కంపెనీ పేరు మీద మాత్రమే చిట్స్ నడపాలి.
- చీటీ కట్టిన వారికి ఎటువంటి సమస్యలు ఎదురైనా జిల్లా డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్‌కు ఫిర్యాదు చేయవచ్చు. ఈ విషయం పాటదారులందరికీ తెలిసేలా ప్రతి చిట్‌ఫండ్ కంపెనీ వద్ద బోర్డులు ఏర్పాటు చేయాలి.
- చిట్‌ఫండ్ చట్టం రూల్ 28 సెక్షన్ 24 ప్రకారం చిట్‌ఫండ్ కంపెనీ నిర్వహించేవారు ప్రతి చిట్ గ్రూపునకు ఆస్తులు, అప్పులు, ఖర్చులు, బిల్లులను ఫారమ్–21లో నమోదు చేసి అందజేయాలి.
- కొత్త చిట్ గ్రూపులో కంపెనీలో చిట్ వ్యవహారాలు చూసే వ్యక్తి(ఫోర్‌మన్)కి ఒక చిట్టీ మాత్రమే వేసుకోవడానికి అనుమతి ఉంటుంది. ఒకటి కంటే ఎక్కువ చిట్టీలు వేయరాదు.
- చిట్‌ఫండ్ కంపెనీ నిర్వహించే వారికి మూడు బ్యాంక్ అకౌంట్లు ఉండాలి. మొదటి అకౌంట్‌లో పాటదారుల చెల్లింపుల వ్యవహారాలు ఉండాలి. చిట్టీ పాడిన తర్వాత ఆ సొమ్మును పాటదారులు తీసుకోకపోతే రెండో అకౌంట్‌లో ఉంచాలి. చిట్‌ఫండ్ కంపెనీ ఉద్యోగుల జీతాలు, ఇతర ఖర్చులు మూడో అకౌంట్‌లో ఉండాలి. ఈ అకౌంట్లకు సంబంధించి ప్రతి నెలా బ్యాంక్ స్టేట్‌మెంట్‌ను అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్‌కు అందజేయాలి.
- వీటితో పాటు చిట్‌కు సంబంధించిన అనేక ఇతర నిబంధనలు కూడా తప్పనిసరిగా పాటించాలి.
- చిట్‌ఫండ్ కంపెనీల్లో రికార్డులు, ఖాతాలు సక్రమంగా నమోదు చేయాలి. ఎటువంటి అక్రమాలు, మోసాలకూ పాల్పడకూడదని, చిట్ పాడుకున్న వారికి వెంటనే సొమ్ము చెల్లించేలా చూడాలని ప్రభుత్వం ఆదేశించింది.
- ఆడిట్ సమయంలో ఏవైనా అక్రమాలు జరిగినట్టు గుర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించింది.

నిబంధనలు పాటిస్తేనే అనుమతులు



కొత్త చిట్‌లు అయినా, గతంలో ఉన్నవి అయినా నిబంధనల ప్రకారం ఉంటేనే అనుమతులు ఇస్తాం.. కొనసాగిస్తాం. చిట్‌ఫండ్ చట్టం–1982 నిబంధనల ప్రకారం సంబంధిత డాక్యుమెంట్లను అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్ పరిశీలించిన అనంతరమే అనుమతులు ఇస్తారు.

– పి.రామలక్ష్మి పట్నాయక్, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా

రైల్వే స్టేషన్లలో ముమ్మర తనిఖీలు



కాకినాడ రైల్వే స్టేషన్‌లో పార్సిళ్లను తనిఖీ చేస్తున్న జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది

కాకినాడ క్రైం/సామర్లకోట/తుని: జిల్లాలోని పలు రైల్వే స్టేషన్లలో ఆర్‌పీఎఫ్ సిబ్బందితో కలిసి రైల్వే పోలీసులు బుధవారం ముమ్మరంగా తనిఖీలు చేశారు. దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ఎస్పీ విశాల్ గున్ని ఆదేశాల మేరకు కాకినాడ టౌన్, పోర్టు, పార్సిల్ కార్యాలయాలు, సామర్లకోట, తుని రైల్వే స్టేషన్లలో ఈ తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల బ్యాగ్‌లు, వెయిటింగ్ హాళ్లు, ప్లాట్‌ఫామ్‌లపై స్టాల్స్, టికెట్ కౌంటర్లు, రైల్వే బోగీలు, పార్కింగ్ ప్రదేశంలోని కార్లలో తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకూ విస్తృతంగా సోదాలు చేశారు. కాకినాడలో సీఐ రామారావు, ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో రవాణాకు సిద్ధం చేసిన ప్రతి ప్యాకింగ్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తుల వివరాలు సేకరించారు. పరిశీలన అనంతరమే పార్సిళ్ల తరలింపునకు అనుమతించారు. డాగ్, బాంబ్ స్క్వాడ్‌లను సైతం తనిఖీలకు వినియోగించారు. సామర్లకోటలో రైల్వే సీఐ డి.రామారావు, స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ పర్యవేక్షణలో బాంబ్ డిస్పోజబుల్ స్క్వాడ్ ఇన్‌చార్జి ఏబీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. జీఆర్‌పీ ఎస్సై బి.లోవరాజు, పార్సిల్ సూపర్‌వైజర్ ఎం.శ్రీరామచంద్రమూర్తి, బాంబ్ డిస్పోజబుల్ టీమ్ హెడ్ కానిస్టేబుల్ వీఎస్ఎన్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. తుని రైల్వే స్టేషన్‌లో కూడా పోలీసులు ఆకస్మిక తనిఖీలు చేశారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు ఈ ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని జీఆర్‌పీ ఎస్సై ఎస్‌కే అబ్దుల్ మారుఫ్ తెలిపారు. ప్రయాణికుల లగేజ్, పార్సిల్ కార్యాలయంలోని వస్తువులను పరిశీలించారు.

ఉపగ్రహ చిత్రాలతో ముంపు నివారణ



శిక్షణలో పాల్గొన్న అధికారులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న సత్యాజీరావు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఉపగ్రహ ఛాయా చిత్రాల ద్వారా పట్టణ ప్రాంతాల్లో ముంపు నివారణ చర్యలు చేపట్టవచ్చని జాతీయ జలవిజ్ఞాన సంస్థ అధిపతి వైఆర్ సత్యాజీరావు అన్నారు. పట్టణ ప్రాంతాల్లో వరదలు, ముంపు నివారణ, తీసుకోవాల్సిన చర్యలపై కాకినాడ జలవిజ్ఞాన సంస్థ కార్యాలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ బుధవారం ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సత్యాజీరావు మాట్లాడుతూ, హైడ్రాలజికల్ మోడలింగ్ ద్వారా ముంపు నివారణ సాధ్యమన్నారు. జాతీయ జలవిజ్ఞాన సంస్థ ఆధ్వర్యాన దేశంలోని వివిధ ప్రాంతాల్లో చేసిన పరిశోధనాంశాలను ఈ శిక్షణ తరగతుల్లో వివరించారు. ముంబై, ఢిల్లీ మెట్రోపాలిటన్ నగరాల్లో ముంపు నివారణకు తీసుకుంటున్న చర్యలను విశ్లేషించారు. శిక్షణ కో ఆర్డినేటర్ వెంకట రమణ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ముంపు నివారణ చర్యలను వివరించారు. వివిధ శాఖల అధికారుల సందేహాలను హెడ్ సత్యాజీరావు నివృత్తి చేశారు. శిక్షణలో పాల్గొన్న మున్సిపల్, ఇరిగేషన్, భూగర్భ జలశాఖ అధికారులకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో జలవిజ్ఞాన సంస్థ శాస్త్రవేత్తలు జయకాంతన్, సవ్యసాచి పాల్గొన్నారు

క్లినికల్ ల్యాబ్ నిర్మాణానికి రూ.3 లక్షల విరాళం

బాలాజీచెరువు (కాకినాడ సిటీ): డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్ భవన నిర్మాణానికి కాకినాడ బంగారు, వెండి వర్తకుల సంఘం అధ్యక్షుడు అనిశెట్టి రామకృష్ణ మంగళవారం రూ.3 లక్షల విరాళం అందజేశారు. స్థానిక దేవాలయం వీధిలోని ట్రస్ట్ కార్యాలయంలో చైర్మన్ డాక్టర్ బాదం బాలకృష్ణకు ఈ మొత్తం అందజేశారు. కార్యక్రమంలో మహ్మద్ ఖాజా మొహిద్దీన్, శ్రీనివాస్ శ్రీరంగ మహడిక్, పులవర్తి సీతారామమూర్తి, మట్టపల్లి సురేష్‌కుమార్, బావిశెట్టి నాగ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



బాదం బాలకృష్ణకు విరాళం అందజేస్తున్న అనిశెట్టి రామకృష్ణ, సభ్యులు

సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అవుతా..

జేఈఈ మెయిన్స్ టాపర్ అశోక్‌చంద్ర



అశోక్‌చంద్రకు స్వీట్ తినిపించి ఆనందం వ్యక్తం చేస్తున్న తల్లి అనంతలక్ష్మి

పిఠాపురం: గొల్లప్రోలుకు చెందిన ఆర్.అశోక్ చంద్ర జేఈఈ మెయిన్స్ టాపర్‌గా నిలిచాడు. 99.94 శాతం మార్కులు సాధించడం ద్వారా అతడు ఈ ఘనత సాధించాడు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అయి, సొంతంగా సంస్థ ఏర్పాటు చేస్తానని చెప్పాడు. వేకువజామున 4 గంటల నుంచి చదివేవాడినని, ఉపాధ్యాయులను అడిగి, స్నేహితులతో గ్రూప్ డిస్కషన్లు జరిపి సందేహాలు నివృత్తి చేసుకునేవాడినని తెలిపారు. అశోక్‌చంద్ర తల్లి అనంతలక్ష్మి గృహిణి. తండ్రి దొరబాబు ఎక్సైజ్ ఎస్సైగా పని చేస్తున్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో రోజుకు 15 గంటలు శ్రమించి ఈ విజయాన్ని సాధించానని అశోక్‌చంద్ర ఆనందం వ్యక్తం చేశాడు.

పోయిందా ఫోన్.. లేదిక టెన్షన్

- అమలాపురం, రాజమహేంద్రవరంలో ప్రారంభించిన ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి
- పోలీస్ స్టేషన్‌కు వెళ్లకుండా.. ఎఫ్‌ఐఆర్ లేకుండా..
- ఫోన్లు పోగొట్టుకున్నవారు వాట్సాప్ మెసేజ్ చేస్తే చాలు

అమలాపురం టౌన్: సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితుల కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో పోలీసులు చాట్‌బాట్ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చారు. కోనసీమ జిల్లా ఎస్పీ, తూర్పు గోదావరి ఇన్‌చార్జి ఎస్పీ సీహెచ్ సుధీర్‌కుమార్‌రెడ్డి ఈ సేవలను బుధవారం ప్రారంభించారు. ఈ విధానం వల్ల బాధితులు పోలీసు స్టేషన్లకు వెళ్లనవసరం లేకుండా, ఎఫ్‌ఐఆర్ నమోదు చేయకుండా కేవలం వాట్సాప్ మెసేజ్‌తో మాయమైన సెల్‌ఫోన్‌ను అన్వేషించి రికవరీ చేసి బాధితులకు అందించే ఏర్పాట్లు జరుగుతాయి. జిల్లా ప్రజలు ఈ కొత్త విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ సుధీర్‌కుమార్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఇంతకు ముందు సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే ఆ బాధితుడు పోలీసు స్టేషన్ వెళ్లి ఫిర్యాదు ఇవ్వాల్సి వచ్చేది. ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేయాల్సి వచ్చేది. ఇప్పుడు కేవలం ఉన్న చోటు నుంచే సెల్‌ఫోన్ లోంచి ఓ మెసేజ్ పంపిస్తే చాలు పోలీసులే మనం ఇచ్చిన ఆధారాలను బట్టి దర్యాప్తు చేసి సెల్‌ఫోన్‌ను ఆచూకీ తెలుసుకుని, రికవరీ చేసి ఇస్తారు.

చాట్‌బాట్ వినియోగించుకోవాలిలా..



- సెల్‌ఫోన్ పోగొట్టుకున్నవారు ముందుగా కోనసీమ జిల్లాలో 8522 91 3300, తూర్పు గోదావరి జిల్లాలో 94932 06459 నంబర్లకు వాట్సాప్‌లో 'హాయ్' లేదా 'హెల్ప్‌లైన్' అని మెసేజ్ పంపించాలి.
- వెంటనే మెసేజ్ పంపిన సెల్‌ఫోన్‌కు 'వెల్‌కమ్ టు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పోలీసు'/'వెల్‌కమ్ టు తూర్పు గోదావరి జిల్లా పోలీసు' పేరున ఒక లింకు వస్తుంది.
- ఆ లింకులో గూగుల్ ఫారం ఓపెన్ అవుతుంది. మీ వివరాలను పూరించాలి. ఈ–మెయిల్ ఐడీ, ఫిర్యాదీ పేరు, చిరునామా, సెల్‌ఫోన్ పోయిన తేదీ, సమయం, పోయిన స్థలం, మొబైల్ ఫోన్ పోయిన విధానం, ఫిర్యాదీ పోలీస్ స్టేషన్ పరిధి, కొనుగోలు చేసిన బిల్లు రశీదు, సెల్‌ఫోన్ ఐఎంఈఐ నంబర్ ఫొటో, మీసేవ ఫిర్యాదు రశీదు, ఫిర్యాదీకి సంబంధించిన ఏదైనా గుర్తింపు పత్రం, పోగొట్టుకున్న మొబైల్‌లో ఉపయోగించిన నంబర్, ఆ ఫోన్ మోడల్, కంపెనీ, రంగు, ఫిర్యాదీని సంప్రదించాల్సిన నంబర్ ఇవ్వాలి.
- ఆ వివరాల ఆధారంగా పోయిన్ మొబైల్‌ని గుర్తించి, దొరికిన తర్వాత బాధితులకు అందజేస్తారు.

ఉపాధికీ ఆధార్



- కూలీల జాబ్‌కార్డులతో అనుసంధానం
- లింక్ లేకపోతే ఇకపై చెల్లింపులు బంద్
- జిల్లాలో చివరి దశకు చేరిన ప్రక్రియ
- అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్రం నిర్ణయం



కాకినాడ సిటీ: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త సంస్కరణలు తీసుకువస్తూనే ఉంది. ఇందులో భాగంగా మరో కొత్త విధానాన్ని అమలులోకి తీసుకురానుంది. కూలీల జాబ్‌కార్డులను వారి ఆధార్ కార్డులతో తప్పనిసరిగా అనుసంధానం చేయాలని నిర్ణయించింది. దీంతో పాటు ఆధార్ కార్డులో ఉన్న విధంగానే జాబ్‌కార్డులో కూడా కూలీల పేర్లు నమోదు చేయాలని ఆదేశించింది. దీనివలన ఉపాధి హామీ పథకంలో బోగస్ కూలీలకు చెక్ పడటమే కాకుండా.. అసలు కూలీల బ్యాంక్ ఖాతాలకు సంబంధించిన సమస్యలు కూడా తగ్గే వీలుంటుంది. ఆధార్ కార్డు అనుసంధానం తర్వాత నేరుగా కూలీ బ్యాంకు ఖాతాల్లోనే వేతనాలు జమ కానున్నాయి. ఆధార్ అనుసంధానం లేని కూలీలు పనులు చేసినా, ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే అవకాశం ఉండదు. ఉపాధి కూలీలకు ప్రస్తుతం బ్యాంకులు, పోస్టాఫీసుల ద్వారా వేతనాలు చెల్లిస్తున్నారు. కొన్నిచోట్ల కూలీలు హాజరు కాకున్నా వేతనాలు పొందుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఇలాంటి అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆధార్ అనుసంధానాన్ని తెర పైకి తీసుకువచ్చింది. దీంతో ఆధార్ లింకైన బ్యాంక్, పోస్టల్ ఖాతాల్లో మాత్రమే కూలీల వేతనాలు జమ కానున్నాయి. పబ్లిక్ ఫండ్ మేనేజ్‌మెంట్ ద్వారా డబ్బులు ఎక్కడికి వెళ్తున్నాయనేది ఢిల్లీ నుంచే కేంద్రం నేరుగా పర్యవేక్షించే వెసులుబాటు కలగనుంది.

కొనసాగుతున్న ప్రక్రియ

జిల్లాలో ఉపాధి హామీ జాబ్ కార్డులను ఆధార్‌తో అనుసంధానం చేసే ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. జిల్లాలో మొత్తం 5,30,833 మంది ఉపాధి కూలీలుండగా ఇప్పటి వరకూ 4,70,833 మందికి ఆధార్ అనుసంధానం పూర్తి చేశారు. ఆధార్ అనుసంధానం ప్రక్రియలో అధికారులకు కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గతంలో ఒకరి జాబ్‌కార్డులో ఇంకొకరి ఆధార్ కార్డు నంబర్ నమోదు చేయడం వంటి తప్పులు ఉండడంతో ఆధార్ అనుసంధాన ప్రక్రియ కొంత క్లిష్టంగా మారింది. దీంతో పాటు ఆధార్‌లో కూలీ పేరు ఎలా ఉంటే అలానే నమోదు చేయకపోతే ఆధార్ అనుసంధానం కావడం లేదు. దీంతో పాటు పలు సమస్యలున్నా వాటిని పరిష్కరించుకుంటూ ఈ ప్రక్రియను అధికారులు కొనసాగిస్తున్నారు.

జిల్లాలో జాబ్‌కార్డులు
4,07,073

ఉపాధి కల్పించిన కుటుంబాలు
1,47,150

వేతనదారుల సంఖ్య
2,12,847

మరో 60 వేల మందికి మాత్రమే..



ఉపాధి హామీ పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు కూలీల జాబ్‌కార్డులను ఆధార్‌కు అనుసంధానం చేస్తున్నాం. ఈ ప్రక్రియ జిల్లాలో కొనసాగుతోంది. జిల్లా వ్యాప్తంగా మరో 60 వేల మందికి మాత్రమే ఆధార్ అనుసంధానం పెండింగ్‌లో ఉంది. దీనిని కూడా త్వరలోనే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– అదపా వెంకటలక్ష్మి, ప్రాజెక్టు డైరెక్టర్, ఉపాధి హామీ పథకం, కాకినాడ జిల్లా

క్లుప్తంగా

లైంగికదాడి నిందితుడి అరెస్టు

సామర్లకోట: మానసిక దివ్యాంగురాలిపై లైంగికదాడి చేసిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు సీఐ కె.దుర్గాప్రసాద్ బుధవారం రాత్రి విలేకర్లకు వివరాలు తెలిపారు. మానసిక దివ్యాంగురాలు అయిన తన కుమార్తెపై వేట్లపాలెం గ్రామానికి చెందిన లక్కిరెడ్డి అప్పన్న లైంగిక దాడి చేశాడని పందురి అనంతలక్ష్మి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దాంతో పోలీసులు కేసు నమోదు చేసి నిందితుడిని వేట్లపాలెం శ్మశాన వాటిక వద్ద బుధవారం అరెస్టు చేసిన్నట్టు సీఐ విలేకర్లకు తెలిపారు. నిందితుడు అప్పన బాధితురాలి ఇంటి సమీపంలోనే ఉంటున్నాడని చెప్పారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో మానసిక దివ్యాంగురాలిపై 56 సంవత్సరాలు అప్పన్న లైంగిక దాడి చేసినట్టు గుర్తించామన్నారు. నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడని సీఐ చెప్పారు. స్పెషల్ మొబైల్ కోర్టుకు నిందితుడిని తరలిస్తామన్నారు. విలేకర్ల సమావేశంలో ఎస్సై సునీత, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బియ్యం దొంగల అరెస్టు

కాకినాడ క్రైం: గోడౌన్‌లో భద్ర పరిచిన బియ్యం బస్తాలు దొంగిలించిన ఐదుగురు దొంగలతో పాటు వాటిని కొనుగోలు చేసిన వ్యక్తి జైలు పాలయ్యాడు. వివరాల్లోకి వెళితే, కాకినాడ బీచ్ రోడ్డులోని సాత్విక్ గోడౌన్స్ నుంచి మంగళవారం రాత్రి 50 కిలోల బరువున్న 118 బస్తాల బియ్యం మాయమయ్యాయి. అది గుర్తించిన యాజమాన్యం కాకినాడ పోర్టు పోలీసులకు ఫిర్యాదు చేయగా సీసీ టీవీ ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించారు. నిందితులు కాకినాడ ముగ్గువీధికి చెందిన ఘంటసాల రమణబాబు, సంజయ్‌నగర్‌కు చెందిన షేక్ అహ్మద్ అలీషా, గోపిశెట్టి రాజేష్, బండి డేవిడ్ రాజు, కొత్తపాకలకు చెందిన నందిన నాగరాజులతో పాటు వారి వద్ద నుంచి బియ్యం కొనుగోలు చేసిన కాకినాడ జగన్నాథపురం గోలీలపేటకు చెందిన కామిశెట్టి రాంబాబును బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. స్వాధీనం చేసుకున్న 118 బస్తాల బియ్యం విలువ రూ.1.89 లక్షలని తెలిపారు.

ఆమె కీర్తి.. ఎందరికో స్ఫూర్తి

- కరాటేలో సత్తా చాటిన రాధ
- ఏడు అంతర్జాతీయ స్థాయి గోల్డ్‌మెడల్స్
- 20 సార్లు జాతీయ స్థాయిలో బంగారు పతకాలు
- కరాటే ఇండియా ఆర్గనైజేషన్ రిఫరీగా ఎంపిక
- పదేళ్లుగా పలువురికి శిక్షణ


రాధ సాధించిన పతకాలు


కొవ్వూరులో కరాటే శిక్షణ అందిస్తున్న ఆళ్ల రాధ


కరాటే ప్రాక్టీస్ చేస్తున్న ఆళ్ల రాధ

కొవ్వూరు: అసలు పేరు ఆళ్ల రాధ. జనం పిలిచే పేరు కరాటే రాధ. అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటుతూ బ్లాక్ బెల్ట్ ఫోర్త్ డాన్‌గా రాణిస్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తోందామె. జపాన్ షోటోకాన్ కరాటే పోటీల్లో పాల్గొని ఇప్పటికే ఏడుసార్లు కటా విభాగంలో బంగారు పతకాలు సొంతం చేసుకుంది. జాతీయ స్థాయిలో ఇరవై బంగారు పతకాలను సొంతం చేసుకుని యువతకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోంది. ఇటీవలే రాధ కరాటే ఇండియా ఆర్గనైజేషన్ (కియో) పరీక్షల్లో పాసై రిఫరీగా ఎంపికైంది. భవిష్యత్తులో ఆమె కరాటే రిఫరీగా కూడా రాణించనుంది. ఆమె కరాటే నేర్చుకుంటానంటే మొదట్లో తల్లిదండ్రులు అంగీకరించలేదు. ఆడ పిల్లలకు కరాటే ఎందుకంటూ పెద్దగా సుముఖత వ్యక్తం చేయలేదు. అయినప్పటికీ వారిని ఒప్పించి, పట్టుదలగా నేర్చుకొని 15 ఏళ్ల ప్రాయంలోనే రాధ జిల్లాస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించింది. ఏడాది తిరగకుండానే రాష్ట్ర స్థాయిలో తన ప్రతిభను చాటుకుంటూ అవార్డులు సొంతం చేసుకుని తల్లిదండ్రుల మనసులు కూడా గెలుచుకుంది.

ఇదీ నేపథ్యం..

రాధ 1993లో ఏలూరులో పుట్టింది. ఆళ్ల రాంబాబు, సూర్యకాంతం ఆమె తల్లిదండ్రులు. బీఏ, బీపీఈడీ చదువుకుంది. జపాన్ షోటోకాన్ కస్నిన్ జూ కరాటే ఏపీ ఇన్‌స్ట్రక్టర్, 6వ డాన్ బ్లాక్ బెల్ట్, డీఎల్ నారాయణ వద్ద శిక్షణ పొందింది. 2012లో వివాహమైంది. పదేళ్లుగా కరాటే శిక్షణ ఇస్తోంది. కొవ్వూరులోని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లు, కళాశాలల్లో ఆడపిల్లల ఆత్మరక్షణకు ఉచిత శిక్షణ అందిస్తోంది. గతంలో రాజమహేంద్రవరంలోని డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్లో 100 మంది మహిళా కానిస్టేబుళ్లకు తొమ్మిది నెలల పాటు కరాటేలో రాధ శిక్షణ ఇచ్చింది. తిరుపతి సమీపంలోని కల్యాణ్‌డామ్‌లో పోలీసు ట్రైనింగ్ సెంటర్లో మహిళా పోలీసు కానిస్టేబుళ్లు, ఎస్సైలు, పురుష ఎస్సైలకు 26 రోజుల పాటు ఆమె శిక్షణ అందించింది. ఈ పదేళ్లలో సుమారు ఐదు వేల మందికి పైగా యువతకు కరాటేలో శిక్షణ ఇచ్చింది. రోజు వారీగా తన శిక్షణ కేంద్రంలో 120 మందికి పైగా చిన్నారులు, యువతకు కరాటే శిక్షణ అందిస్తూ యువతకు కరాటే పట్ల ఆసక్తి పెంచుతోంది.

> **ఏషియన్ లేడీ రిఫరీగా ఎదగాలని ఉంది**
>
> ఏషియన్ కరాటే లేడీ రీఫరీ స్థాయికి ఎదగాలని ఉంది. చిన్నతనంలో జాకీచాన్ సినిమాలు చూసి కరాటేపై ఆసక్తి పెంచుకున్నా. మా నాన్న బాడీ బిల్డర్ కావడంతో ఆయన్ను స్ఫూర్తిగా తీసుకునేదాన్ని. కరాటే ఇన్‌స్ట్రక్టర్‌గా ఎంతోమంది యువతులకు శిక్షణ అందించడం ఆనందంగా ఉంది. ఆత్మస్థైర్యం, వ్యక్తిగత రక్షణకు కరాటే నేర్చుకోవడం యువతులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.
>
> –ఆళ్ల రాధ, కరాటే బ్లాక్ బెల్ట్ ఫోర్తుడాన్, కొవ్వూరు

విజిలెన్స్ దాడులు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో విజిలెన్స్ ఎస్పీ పీవీ రవికుమార్ ఆధ్వర్యాన అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం ధవళేశ్వరం, కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం కాట్రవులపల్లి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం డి.కేశవరం పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న వైద్య సదుపాయాలు, మందుల లభ్యత, వైద్య సిబ్బంది హాజరు, మౌలిక వసతులు, తాగునీటి లభ్యత, పరిసరాల పరిశుభ్రత వంటి అంశాలను పరిశీలించారు. దీనిపై ప్రభుత్వానికి నివేదిక నివేదిక సమర్పిస్తామని ఎస్పీ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న వ్యాన్

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని చొల్లంగి గొడౌన్స్ ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి ఒక వ్యాన్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొనడంతో అది విరిగిపోయింది. కోరంగి పోలీసులు తెలిపిన వివరాల మేరకు తాళ్లరేవు నుంచి కాకినాడ వైపు వెళుతున్న వ్యాన్ అకస్మాత్తుగా రహదారి చెంతన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో విద్యుత్ స్తంభం విరిగిపోయి పడిపోగా, వ్యాన్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. ఈ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లయ్యింది. విద్యుత్‌శాఖ సిబ్బంది బుధవారం ఆ స్తంభాన్ని తొలగించి కొత్తది వేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మోటారు సైకిల్‌తో ఢీకొట్టిన వ్యక్తికి ఏడాది జైలు

రామచంద్రపురం రూరల్: ఉద్దేశ పూర్వకంగా ఒక వ్యక్తిని మోటారు సైకిల్‌తో గుద్ది గాయపరిచిన నేరం రుజువు కావడంతో ఉట్రుమిల్లి గ్రామానికి చెందిన దొండపాటి కుమార్‌కు ఏడాది జైలు శిక్ష, రూ. 10 వేలు జరిమానా విధించినట్టు ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ బుధవారం విలేకరులకు తెలిపారు. 2020 సెప్టెంబర్ 2న ఉట్రుమిల్లి గ్రామానికి చెందిన నీల వెంకటేశ్వర్లును అదే గ్రామానికి చెందిన దొండపాటి కుమార్ మోటారు సైకిల్‌తో వెనుక నుంచి గుద్ది గాయపరిచాడు. అప్పటి ఎస్సై ఎన్.రామకృష్ణ కేసు నమోదు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్రీరాములు వాదనతో నేరం రుజువు కాగా రామచంద్రపురం ఏజేఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ ఆర్.ఆశీర్వాదం పాల్ తీర్పు వెలువరించారు.

ఉత్సాహంగా 'నన్నయ' క్రికెట్ జట్టు ఎంపిక


ఎంపికైన జట్టుతో ఇన్‌చార్జి వీసీ ప్రసాదరాజు తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ క్రికెట్ జట్టు ఎంపికను బుధవారం కాకినాడ జిల్లా క్రీడామైదానంలో నిర్వహించారు. పిఠాపురం సూర్యరాయ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలకు యూనివర్శిటీ పరిధిలోని కళాశాలల నుంచి 80 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వీరికి బ్యాటింగ్, ఫీల్డింగ్, బౌలింగ్‌లో ప్రాథమిక పరీక్షలు నిర్వహించి 16 మందితో కూడిన జట్టును కమిటీ ఎంపిక చేసింది. ఎంపిక కమిటీ సభ్యులుగా ఫణీంద్ర, వీబీఎంయూ సారథి, పరిశీలకునిగా యూనివర్శిటీ పీడీ సీహెచ్ సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. సూర్యరాయ డిగ్రీ కళాశాల అధినేత, అక్కు స్పోర్ట్స్ బోర్డు సభ్యులు హబీబ్‌బాషా అధ్యక్షతన సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి నన్నయ ఇన్‌చార్జి వీసీ, కాకినాడ జేఎన్టీయూకే వీసి జీవీఆర్ ప్రసాదరాజు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అంతర్ యూనివర్శిటీ క్రికెట్ పోటీలలో రాణించి యూనివర్శిటీకి మంచి పేరు తేవాలని క్రీడాకారులకు సూచించారు. గౌరవ అతిథిగా వచ్చిన ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ సుగుణారెడ్డి మాట్లాడుతూ తమ విద్యాసంస్థల్లో చదువుతోపాటు క్రీడలకు పెద్దపీట వేస్తున్నామన్నారు. క్రీడాస్ఫూర్తిని అలవర్చుకుని చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కోరారు. ఎంపికైన జట్టు ఈ నెల 20 నుంచి బెంగళూరులోని రేవ్ యూనివర్శిటీలో జరిగే ఆల్ ఇండియా అంతర్ యూనివర్శిటీ క్రికెట్ పోటీలలో పాల్గొంటుంది. ఈ కార్యక్రమంలో జేఎన్టీయూకే పీడీ శ్యాంకుమార్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఐసీఐసీఐ బ్యాంక్ అధికారులకు నాన్ బెయిలబుల్ వారెంట్లు

కాకినాడ లీగల్: ఐసీఐసీఐ బ్యాంక్ అధికారులు కేసు విషయంలో కోర్టుకు హాజరు కానందున కాకినాడ వినియోగదారుల కమిషన్ -1 అధ్యక్షుడు రఘుపతి వసంతకుమార్ నాన్ బెయిలబుల్ వారెంట్లు బుధవారం జారీ చేశారు. రాజమహేంద్రవరం ఐసీఐసీఐ బ్యాంక్‌లో కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటకు చెందిన జంపన చంద్రశేఖర్‌వర్మ 2006లో ఇంటి రుణం తీసుకున్నారు. రుణం చెల్లించినా ఇంటి ఒరిజినల్ డాక్యుమెంట్స్ తిరిగి ఇవ్వలేదు. దీంతో బ్యాంక్ అధికారులపై చంద్రశేఖర్‌వర్మ కాకినాడ వినియోగదారుల కమిషన్‌లో 2019 డిసెంబర్ 31న కేసు దాఖలు చేశారు. ఒరిజినల్ డాక్యుమెంట్స్‌తోపాటు పరిహారంగా రూ.లక్ష, ఖర్చులు రూ.8 వేలు, 2 నెలల లోపులో చెల్లించాలని 2022 ఆగస్టు 8 తేదీన వినియోగదారుల కమిషన్ తీర్పు చెప్పింది. బ్యాంక్ అధికారులు స్పందించలేదు. దీనిపై రాజమహేంద్రవరం ఐసీఐసీఐ బ్యాంక్ లిమిటెడ్ హోమ్ లోన్స్ బ్రాంచ్ మేనేజర్‌తోపాటు హైదరాబాద్, ఢిల్లీ, ముంబయి, గుజరాత్‌లోని వడోదర ఐసీఐసీఐ అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేసినా అందుకొని, కోర్టుకు హాజరుకానందున నాన్ బెయిలబుల్ వారెంట్లను వినియోగదారుల కమిషన్ జారీ చేసింది.

ఇద్దరి అరెస్టు

కొత్తపల్లి: నాటు తుపాకీతో సంచరిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు బుధవారం పోలీసులు తెలిపారు. చిత్రాడకు చెందిన సీకోలు దుర్గాప్రసాద్, పీతల గణేష్ పిట్టలను కాల్చే నాటు తుపాకీతో ఉప్పాడ బీచ్‌రోడ్డులో వస్తుండగా అరెస్ట్ చేసి, తుపాకీ, మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాణిక్యాంబకు బంగారు చీర


బంగారు చీర అలంకరణలో ఉన్న అమ్మవారు, స్వామి

పెదపూడి: మండలంలోని జి.మామిడాడ శివారు ఎల్ఎన్ పురంలో ప్రసిద్ధి చెందిన శ్రీ మాణిక్యాంబ సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారికి రెండు కేజీల బంగారు చీరను బుధవారం అలంకరించారు. భక్తులు, దాతలు, గ్రామస్తులు ఈ చీరను సమకూర్చారు. ఈ సందర్భంగా అర్చకులు విశేష పూజలు చేశారు. అనంతరం భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అన్నదానం నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాలాత్రిపురసుందరికి వెండి చీర


వెండి చీరను అందజేస్తున్న సుధాకరరెడ్డి, పద్మజ దంపతులు


వెండి చీరలో శ్రీబాలాత్రిపుర సుందరి అమ్మవారు

రాయవరం: మండలంలోని సోమేశ్వరంలో వేంచేసియున్న శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సోమేశ్వరస్వామి అమ్మవారికి భక్తులు రజత చీరను బహూకరించారు. గ్రామానికి చెందిన కర్రి సూర్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన భార్య కర్రి మంగయ్యమ్మ, కుమారులు సుధాకరరెడ్డి, పద్మజ, కుమార్తె సత్తి సూర్యకళ, శ్రీనివాసరెడ్డి దంపతులు వెండి చీరను అమ్మవారి అలంకరణ నిమిత్తం ఆలయ అర్చకులు పరిటాల సుబ్రహ్మణ్యశర్మకు అందజేశారు. రూ.6.50 లక్షల విలువైన 5.550 కేజీల వెండితో చీరను తయారు చేయించినట్లు వారు తెలిపారు. అమ్మవారికి చీరను అలంకరించడానికి ముందుగా రజత చీరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆరిఫ్, ఆలయ చైర్మన్ గరగ వెంకటేశ్వరరావు, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ నల్లమిల్లి వీర్రాఘవరెడ్డి, ఆలయ ఈవో నిల్లా అయ్యపరాజు, సిబ్బంది పెమ్మాడ వెంకటేశ్వరరావు, భక్తులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలి


జ్యోతి వెలిగించి సదస్సు ప్రారంభిస్తున్న జేఎన్‌టీయూకే అధ్యాపకులు చక్రవర్తి, కార్యదర్శి సుగుణారెడ్డి

బాలాజీచెరువు: విద్యార్థులు చైతన్యవంతులై అవకాశాలను ఒడిసిపట్టాలని, సరికొత్త విధానాలతో నూతన ఆవిష్కరణలకు నాంది పలకాలని జేఎన్‌టీయూకే అధ్యాపకులు డాక్టర్ ఏఎంఎస్ఎస్ చక్రవర్తి పేర్కొన్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాలలో బీసీఏ (బ్యాచ్‌లర్ ఆఫ్ కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్) ఆధ్వర్యంలో ప్రోవెస్ 23 5వ రాష్ట్ర స్థాయి సదస్సును బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆదిత్యలో బీసీఏ కోర్సు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తూ వేలాది మందికి ఉపాధి అవకాశాలు కల్పించడం సంతోషమన్నారు. విద్యార్థులు ఆలోచనా విధానాన్ని, సమయాన్ని, సాంకేతికతను, తల్లిదండ్రులు ఇచ్చే డబ్బును సరైన విధానంలో ఉపయోగించుకున్నప్పుడే ఫలితం ఉంటుందన్నారు. ఆదిత్య విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ సుగుణారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా తీర్చిదిద్దేలా ఈ కోర్సు నిర్వహిస్తున్నామన్నారు. కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు మాట్లాడుతూ వచ్చేతరం కంప్యూటర్ సైన్స్ విద్యార్థులదేనని అన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు తిలకించి పలు క్విజ్ పోటీలలో ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ప్రిన్సిపాల్ బ్యులా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.